సాక్షి
కాకినాడ

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



చెరువులో మద్యం సీసాలు

కాకినాడ జిల్లా తుని మండలం రాపాక గ్రామ శివారు చెరువులో మద్యం సీసాలు ఉండడంతో కలకలం రేగింది. పోలీసులు అనుమానితులపై కేసులు నమోదు చేశారు. - IIలో



శక్తి రూపిణీ శరణు శరణు

శక్తి రూపిణీ శరణు శరణు అంటూ ఆ దుర్గామాతను భక్తజనం పూజించింది. శరన్నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. - IIలో

98 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 98,536 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 12,200 క్యూసెక్కుల నీటిని వదిలారు.

ఎర్రమెట్టలో పచ్చ దోపిడీ

- కొండలు పిండి చేసి రూ.కోట్లలో దందా
- రామేశంమెట్టలో దళితుల భూములు గుల్ల
- రాత్రిపూట గుట్టుగా గ్రావెల్ మాయం
- నిత్యం దోపిడీ రూ.15 లక్షల పైమాటే!
- ఏడీబీ రోడ్డు ఆధునీకరణ పేరుతో లీజు
- మాజీ మంత్రి కనుసన్నల్లో తమ్ముళ్ల దోపిడీ



రామేశంమెట్టపై లారీల్లోకి గ్రావెల్‌ను లోడ్ చేస్తున్న పొక్లెయిన్



రామేశంమెట్టపై కొండకు గుండు కొట్టేసిన అక్రమార్కులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారం చేతికొచ్చిందనే ధైర్యంతో ఆ పార్టీ నేతలు అడ్డూ అదుపు లేకుండా చెలరేగిపోతున్నారు. కొండలను పిండిచేసి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. కళ్లెదుటే కొండలు కరిగిపోతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడట్లేదు.. నోరు మెదపడం లేదు. అధికార పార్టీ అండతో, టీడీపీ కీలక నేతల కనుసన్నల్లో అనుచరులు దోపిడీకి పాల్పడుతున్నారు. 1975, 77, 86 సంవత్సరాల్లో 800 మంది నిరుపేద దళితులకు సాగు కోసం ఇచ్చిన కొండ భూములను సుమారు పదిహేను అడుగుల లోతున తవ్వేసి సొమ్ము చేసుకోవడం ఐదేళ్ల తరువాత మళ్లీ మొదలైంది. 2014–19లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి కేబినెట్‌లో కీలక శాఖ నిర్వహించిన ప్రజాప్రతినిధి, అతని అనుచరగణం కొండలను తవ్వేసి కోట్లు కొల్లగొట్టేశారు. నిత్యం వందలాది టిప్పర్లు, లారీల్లో గ్రావెల్‌ను వేల టన్నులు జిల్లా సరిహద్దులు దాటించేయడం అప్పట్లో రాష్ట్ర స్థాయిలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ తరువాత అధికారం కోల్పోవడంతో ఐదేళ్ల పాటు కిమ్మనకుండా ఉన్నారు. అధికారం తిరిగి దక్కడంలో ఇప్పుడు అధికారపార్టీ నేతలు జూలు విదిల్చి కొండలను కొల్లగొడుతున్నారు.

కాకినాడ జిల్లా జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల సరిహద్దులో ఉన్న రామేశంమెట్ట మీద పడి తెలుగు తమ్ముళ్లు చేస్తున్న దందా అంతా ఇంతా కాదు. ఈ రెండు నియోజకవర్గాల్లోని గండేపల్లి, పెద్దాపురం మండలాల పరిధిలో ఈ రామేశంమెట్ట కొండ భూములున్నాయి. ఉండటానికి రెండు నియోజకవర్గాల సరిహద్దులో ఉన్నా లబ్ధిదారులంతా పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురం మండలం ఆనూరు, కొండపల్లి, వాలుతిమ్మాపురం గ్రామాల పరిధిలో రామేశంమెట్ట వారే. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సహజంగా ఈ నియోజకవర్గ నేతల ఆధిపత్యమే మెట్టపై కొనసాగుతోంది. రామేశం మెట్టలో సర్వే నంబరు 1 నుంచి 90 వరకు 823 ఎకరాల్లో కొండలున్నాయి. నిరుపేద దళితులు సాగుచేసుకుని జీవనోపాధి పొందేలా నాడు ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ హయాంలలో అర ఎకరం, ఎకరం, ఎకరన్నర వంతున సుమారు 800 మందికి డి-పట్టా భూములు ఇచ్చారు. ఇవన్నీ లక్షలు కురిపించే ఎర్రమట్టి (రెడ్ గ్రావెల్) కొండలే కావడంతో అధికార పార్టీ నేతలు దర్జాగా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ భూముల్లోనే అసైన్ చేసిన భూములు కూడా ఉన్నాయి. అధికారంలో ఉన్నన్నాళ్లు సాగుకు అనుకూలంగా చదును చేస్తామని సాకులు చెప్పి కొండలను తవ్వేసి గ్రావెల్‌ను అమ్ముకు తినేయడం టీడీపీ నేతలకు పరిపాటిగా వస్తోంది.

గద్దెనెక్కి మూడు నెలలు తిరగకుండానే మిగిలి ఉన్న కొండను తవ్వేసి గ్రావెల్‌ను అమ్మేసుకోవాలని ప్లాన్ చేశారు. ఇందుకు ముందస్తు ప్రణాళికగా కేంద్ర ప్రభుత్వం భారతమాలలో భాగంగా చేపట్టిన కాకినాడ పోర్టు–ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ రోడ్డు) నిర్మాణం అనే అభివృద్ధి ముసుగు తగిలించారు. ఈ రోడ్డు నిర్మాణానికి గ్రావెల్ అవసరం వచ్చింది. ఇందుకోసం పెద్దాపురం టీడీపీ ముఖ్య నేత అనుచరగణం రంగంలోకి దిగింది. ఇందుకు కొందరు రెవెన్యూ అధికారులు కూడా తోడయ్యారు. ఇంకేముంది వారు అనుకున్న ప్రణాళిక ప్రకారం చక్కగా చక్కబెట్టేశారు. రామేశంమెట్ట పరిధిలోని ఆనూరు గ్రామానికి చెందిన డి–పట్టాదారు కొల్లి పుత్రయ్యకు చెందిన 1.50 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారు. ఈ భూమిలో గ్రావెల్‌ను భారతమాల రహదారి విస్తరణ కోసమని రెవెన్యూ అధికారుల వద్ద అనుమతి తీసుకుని రాత్రి వేళల్లో తవ్వేసి రామేశంమెట్టలో ఉన్న మిగిలిన భూములను గుల్ల చేస్తున్నారు.

ఎకరన్నరకు అనుమతి తీసుకుని సమీప భూముల్లో లబ్ధిదారులకు ఎంతో కొంత చేతిలో పెట్టి వందల లారీల్లో గ్రావెల్‌ను అమ్మేసుకుంటున్నారు. పెద్దాపురం తేదేపా ముఖ్యనేత తనయుడి కనుసన్నల్లో అతని అనుచరులు గడచిన నెలన్నరగా రాత్రిపూట అడ్డగోలుగా గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి తొమ్మిది, పది గంటలకు మొదలుపెట్టి తెల్లవారుజాము వరకు రామేశంమెట్టపై కొండను పదుల సంఖ్యలో పొక్లెయిన్లను పెట్టి తవ్వేస్తున్నారు. అక్కడ తవ్విన గ్రావెల్‌ను వందకు మించి టిప్పర్లు, లారీలలో పెద్దాపురం పట్టణం మీదుగా కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ల కోసం తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి లారీ రూ.15 వేలు నుంచి రూ.20 వేలుకు విక్రయిస్తున్నారు. తక్కువలో తక్కువ లెక్కస్తే రోజుకు రూ.15 లక్షలు అధికార పార్టీ నేతలు వెనకేసుకుంటున్నారు. ఇలా నెలకు సుమారుగా రూ.45 కోట్ల వరకు దోచేస్తున్నారని అంచనా. ఇలా వచ్చిన సొమ్మును వారం వారం తేదేపా నేత తనయుడు, తెలుగు తమ్ముళ్లు, కూటమి నేతలకు 70, 30 శాతంగా పంపకాలు చేసుకునే ఒప్పందంతో ఈ గ్రావెల్ దోపిడీ జరుగుతోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖలు కన్నెత్తి చూడటం లేదు.

ఏడీబీ రోడ్డుకు గ్రావెల్ కోసం అనుమతించాం



ఏడీబీ రోడ్డు అభివృద్ధి నిమిత్తమే గ్రావెల్ తవ్వకాలు, తరలింపునకు అనుమతిచ్చాం. ఒక లబ్ధిదారుడు డి పట్టా భూమిలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఉంది. ఆ భూముల్లో మాత్రమే అదీ కూడా సంబంధిత రోడ్డు నిర్మాణ సంస్థ ద్వారానే గ్రావెల్ తవ్వుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న విషయం తమ దృష్టికి రాలేదు. అనధికారికంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదు.

– కె.వెంకటలక్ష్మి, తహసీల్దార్, పెద్దాపురం

దళితుల భూములు గుల్ల చేయడం అన్యాయం'



రామేశంమెట్టపై రాత్రిపూట అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి. వందల కొద్దీ లారీల్లో గ్రావెల్ తరలించుకు పోతున్నా అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. పెద్దాపురం పట్టణం మీదుగా గ్రావెల్ తరలిస్తున్న వందల కొద్దీ లారీలతో ప్రజలు నిద్రకు కరవవుతోంది. నిరుపేద దళితుల జీవనోపాధి కోసం ఇచ్చిన భూముల్లో ఫలసాయం వచ్చే వాటిని గుల్ల చేయడం అన్యాయం. జిల్లా యంత్రాంగం తక్షణం కట్టడి చేయాలి.

– గుణ్ణం లక్ష్మణరావు, చైర్మన్, ఫర్ ద పీపుల్ ఫౌండేషన్, పెద్దాపురం

న్యూస్‌రీల్

తాగునీరు, పారిశుధ్యం ప్రధాన లక్ష్యం

- జిల్లాలో అన్ని గ్రామాలకు నోడల్ అధికారుల నియామకం
- కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలోని అన్ని పాఠశాలలు, ఆస్పత్రులు, వసతి గృహాలు, గ్రామాల్లో తాగునీటి వసతి పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు కలెక్టర్ షణ్మోహన్ గురువారం విలేకర్లకు తెలిపారు. మొదటిగా పిఠాపురం నియోజకవర్గంలోని మండలాలు, గ్రామ పంచాయతీల్లో, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని పాఠశాలలు ఆస్పత్రులు, వసతి గృహాలు, గ్రామాల్లో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు ప్రతి గ్రామానికి నోడల్ అధికారులను నియమించినట్టు తెలిపారు. వారు పేర్కొన్న ప్రతి సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు కలెక్టర్ వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకించి నిధులు కేటాయించినట్టు తెలిపారు.

ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు

కాకినాడ సిటీ: జిల్లాలో ఇసుక సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నట్టు జేసీ రాహుల్ మీనా గురువారం తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ కింద ఈ ఏడాది జూలై 8 నుంచి ఇసుక సరఫరా చేస్తున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు ఎటువంటి రీచ్‌లు, డీ-సిల్టేషన్ పాయింట్లు, ఇసుక డిపోలు ఉనికిలో లేవన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ప్రజల అవసరాల కోసం ఇసుకను సేకరించనున్నట్టు జేసీ తెలిపారు. జిల్లాకు నిర్దిష్ట రీచ్‌ల కేటాయింపునకు తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల కలెక్టర్లతో చర్చించి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లాలో 257 మంది రవాణాదారులు తమ వాహనాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ఎవరైనా ఇసుక అక్రమ విక్రయాలు, హోల్డింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎవరైనా ఇసుకపై ఫిర్యాదు చేయాలనుకుంటే కాకినాడలోని జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారికి టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 6019కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

14న పీజీఆర్ఎస్ రద్దు

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఈ నెల 14వ తేదీ సోమవారం అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు గమనించాలని ఆయన కోరారు.

అదనపు ఎస్పీగా శ్రీనివాసరావు

కాకినాడ క్రైం: జిల్లా అదనపు ఎస్పీగా ఎస్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీగా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్నారు. జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తున్న బి.సత్యనారాయణ కృష్ణ జిల్లాకు బదిలీ అయ్యారు.

మద్యం దుకాణాలకు 2119 దరఖాస్తులు

కాకినాడ క్రైం: మద్యం టెండర్ల ప్రక్రియ తుది అంకానికి చేరింది. తొలి వారంలో అంతంత మాత్రమే వచ్చినా గురువారం రాత్రి వరకు 155 దుకాణాలకు 2119 దరఖాస్తులు అందాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కృష్ణకుమారి తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి

- అధికారులకు జేసీ మీనా ఆదేశం
- వివిధ శాఖల అధికారులకు శిక్షణ



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ద్వారా నిర్వహించే ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో ఆర్ఎస్‌కే ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై మండల స్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం 2024–25 ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల సంస్థ ద్వారా ధాన్యం కొనుగోలుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో అనుసరించాల్సిన విధానం, నాణ్యత ప్రమాణాల అమలు, కనీస మద్దతు ధర, గోనె సంచులు, మండల స్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ ఏర్పాటు, కస్టోడియన్ అధికారుల నియామకం, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా రైసు మిల్లులకు తరలింపు వంటి అంశాలపై జేసీ రాహుల్ మీనా, మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. జిల్లాలో 277 ఆర్ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కమిటీ, అధికారులు సమన్వయంతో పని చేసి, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు రైస్ మిల్లు ఎంచుకొనే వెసులుబాటు కల్పించారన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 8886903611ను సంప్రదించవచ్చని జేసీ రాహుల్ మీనా రైతులకు తెలిపారు.

పన్ను చెల్లింపుదారులే పాలనకు ప్రధానం

- ఆదాయ పన్ను కమిషనర్ శ్రీనివాస్
- వివాద్ సే విశ్వాస్ పథకంపై అవగాహన సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న ఆదాయపు పన్ను ప్రధాన కమిషనర్ శ్రీనివాస్

బాలాజీచెరువు (కాకినాడ): ఆదాయ పన్ను చెల్లింపుదారులు దేశ ఆర్థికాభివృద్ధికి, పరిపాలనకు ముఖ్యులని విశాఖపట్నం ఆదాయ పన్ను ప్రధాన కమిషనర్ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా భవనంలో ఆదాయ పన్ను శాఖ, కాకినాడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సంయుక్త (ఐసీఏఐ) ఆధ్వర్యంలో ఆదాయం పన్నులు, వివాద్ సే విశ్వాస్ పథకం–2024పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు శ్రద్ధాంజలి ఘటించి అనంతరం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి, ఆదాయపు పన్ను ప్రధాన కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను చెల్లింపు, రిఫండ్ విషయంలో చోటు చేసుకొంటున్న సమస్యలపై అవగాహన కల్గించారు. ఆదాయపు పన్ను చెల్లిపులో చట్టపరమైన వివాదాలు ఎదుర్కొంటున్న వారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివాద్ సే విశ్వాస్ పథకం ద్వారా పరిష్కారం పొందవచ్చని చెప్పారు. 2024–25 ఆదాయపు పన్ను చెల్లింపు విధానాలలో వచ్చే మార్పుల గురించి వివరించారు. కార్యక్రమ అధ్యక్షుడు, చార్టెడ్ అకౌంటెంట్స్ చైర్మన్ పి.అనురాధ కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సుల వల్ల ఆదాయ పన్ను చెల్లింపులో లోపాలను సరిదిద్దవచ్చన్నారు. ఆదాయపు పన్ను సంయుక్త అధికారి బి.హేమ భూపాల్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను రిటర్న్‌లను సమర్పించే ముందు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా చెల్లింపులను సమర్పించిన పత్రాలను పరిశీలించాలని వివరించారు. సహాయ కమిషనర్ జి.తిరుపతిరావు మాట్లాడుతూ ఆదాయపు పన్ను రిటర్నులను రూపొందించడంలోను పన్ను చెల్లింపుదార్లకు అవగాహన కల్పించడంలో చార్టెడ్ అకౌంటెంట్లు చాలా ముఖ్యమన్నారు. సదస్సుకు హాజరైన అధికారులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్‌సి వైస్ చైర్మన్ ఎ కార్యదర్శి పీఎస్ ఎన్ మూర్తి, ఎక్స్ అఫీషియో జి.నరేష్ చంద్ర, చార్టెడ్ అకౌంటెంట్లు వి.రాధ, సీవీవీ గంగారామ్, బి.రవి, 120 మంది చార్టెడ్ అకౌంటెంట్లు, ఆదాయపు పన్ను అభ్యాసకులు పాల్గొన్నారు.

అద్భుతం.. ఐశ్వర్యాంబిక అర్చనం

- శ్రీపీఠంలో 70 వేల మంది మహిళలతో లలితా నామంతో కుంకుమార్చన
- 8వ రోజుకు చేరుకున్న మహాశక్తి యాగం
- 90 కోట్లకు చేరిన అర్చనలు
- బగళాముఖిగా అమ్మవారి దర్శనం



ఐశ్వర్యాంబిక సన్నిధిలో లలితా నామాలు పఠిస్తున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

కాకినాడ రూరల్: కాకినాడ నాలుగు దిక్కులు పెక్కుటిల్లేలా లలితాంబ సహస్ర నామాలతో మహిళలు కుంకుమార్చనలు చేస్తున్నారు. గురువారం ఒక్క రోజే సుమారు 70 వేల మంది మహిళలు శ్రీపీఠం వేదికగా మహా అద్భుతం సృష్టించారు. అమ్మే సర్వస్వంగా భావించి తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు అరుణ వర్ణపు దీక్షా వస్త్రాలు ధరించి ఐశ్వర్యాంబిక అమ్మవారి సన్నిధిలో మహాశక్తి యాగం విజయవంతం చేశారు. పీఠం వ్యవస్థాపకుడు పరిపూర్ణనంద స్వామి తలపెట్టిన కార్యం కాకినాడను పునీతం చేసింది. గత ఏడాది కార్తికమాసంలో వంద కోట్ల లలితా కుంకుమార్చనలతో చేపట్టిన మహాశక్తి యాగాన్ని విజయవంతంగా నిర్వహించిన స్ఫూర్తితో దసరా వేడుకల్లో దేవీ శరన్నవరాత్రులలో అమ్మ కోసం లక్ష మంది పేరిట వంద కోట్ల కుంకుమార్చనలు నిర్వహిస్తామని నాడు ప్రకటించి నేడు క్రియాశీలకంగా చేసి చూపారు. ఈ నెల మూడో తేదీన ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని శ్రీపీఠంలో మహాశక్తి యాగాన్ని ప్రారంభించారు. నవరాత్రుల్లో 8వ రోజు దుర్గాష్టమి నాడు 64 వేల మందితో కుంకుమార్చనలు చేపట్టేందుకు ముందుగా రిజిస్ట్రేషన్లు చేయగా గురువారం సుమారు 70 వేల మంది భక్తులు హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు భక్తులతో మహాశక్తి యాగం వేదిక ఎదురుగా ఉన్న ప్రాంగణం నిండిపోయింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల కోసం అదనంగా నిత్యాన్నదాన ప్రసాదం కౌంటర్ల కోసం వినియోగించే విశాలమైన స్థలాన్ని వేదికగా మార్చారు. దీంతో మహిళలు కూర్చుని కుంకుమ పూజలు నిర్వహించారు. వేలాదిగా వచ్చిన భక్తులకు ప్యాకెట్ల రూపంలో అన్న ప్రసాదం అందించారు. ఎనిమిదో రోజు పూజల్లో భాగంగా దేవీ కవచం, బగళాముఖి హోమం, నవగ్రహ దోష పరిహారం కోసం లక్ష మంత్రార్చన నిర్వహించారు. సాయంత్రం ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు బగళాముఖి రూపంలో దర్శనమిచ్చారు.

ఈ సందర్భంగా పరిపూర్ణనంద స్వామి మాట్లాడుతూ అమ్మకంటే వేరే దైవం లేదని, అమ్మ అనే పలుకే శ్రీరామరక్ష అన్నారు. శ్రీపీఠంలో మహాశక్తి యాగం అమ్మ దయతోనే సాధ్యమైందన్నారు. శత కోటి కుంకుమార్చన కార్యక్రమం గురువారం నాటికి 90 కోట్లకు చేరిందని ప్రకటించారు. మహాశక్తి యాగం ఎటువంటి ఆటంకాలు లేకుండా జరుగుతోందని, ఇటువంటి మహాకార్యంలో పాల్గొనే అందరూ అదృష్టవంతులన్నారు. అందరూ సంపదలు కోరుకుంటారని కానీ మన వెంట ఆపదలే నడుస్తాయని, సుఖం – దుఃఖం, సంపద –ఆపద, సంపత్తు –విపత్తు ఈ రెండు ద్వంద్వ వైఖరులన్నారు. ఆపద లేని స్థితి పొందాలంటే అమ్మను కొలవాలన్నారు. అమ్మ పాదాలను పూజించాలని, గురువు పదాలను అనుసరించాలని సూచించారు. మహాశక్తి యాగంతో కాకినాడలో అద్భుతమైన చరిత్ర ఆవిష్కృతమైందని ఆనందం వ్యక్తం చేశారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అమ్మను ఆరాధించేందుకు వచ్చారని, స్త్రీ మూర్తిగా పుట్టడమే అమ్మను ఆరాధించడానికి అర్హుతన్నారు. ఒక బిడ్డ, ఒక తల్లికి ఉన్న బంధం ఎలాంటిదో అమ్మతో ఉన్న బంధం అలాంటిదన్నారు. అమ్మ వారి మంత్రం జపించడం ద్వారా సర్వ ఆపదలను తొలగించి సంపదలను ఇస్తుందన్నారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు లలితా సహస్ర నామార్చనలు చేసి ఆకట్టుకున్నారు. గంగాభవాని అనే భక్తురాలు చీరపై లలితా సహస్ర నామం రాసి స్వామిజీకి అందజేశారు.



మహాశక్తి యాగంలో పాల్గొని లలితా నామార్చనలతో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
భార్యకు తీవ్ర గాయాలు


జగదీష్ (ఫైల్)

నల్లజర్ల: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లజర్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన నారకొండ జగదీష్ (40) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం అక్కడి సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమం ముగించుకుని భార్య జయలక్ష్మికి అస్వస్థతగా ఉండటంతో బైక్‌పై వీరిద్దరూ నల్లజర్ల వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లజర్ల శివారులో ఉన్న పోలవరం కాలువ వంతెన సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను అధిగమించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న జగదీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జయలక్ష్మిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, జగదీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదం ఏవిధంగా జరిగిందనే దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

చీటింగ్ కేసులో నిందితురాలి అరెస్ట్

సామర్లకోట: చీటింగ్ కేసులో ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు సామర్లకోట సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రభుత్వ పథకాలకు సొమ్ము వచ్చే విధంగా చేస్తానని జి.మేడపాడులో వీరంపాలెం పాకలు గ్రామానికి చెందిన బొక్కి సుందరమ్మను మోసం చేసి బంగారు ఆభరణాలను సామర్లకోటకు చెందిన గంటా చెంగా తీసుకుపోయినట్లు ఫిర్యాదు అందింది. ఈ మేరకు సీఐ గంటా చెంగాను విచారణ చేయగా నేరం రుజువు అయ్యింది. వీటితో పాటు అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధి కత్తిపూడిలో ఓ మహిళను మోసం చేసి బంగారు చెవి దుద్దులు, మండపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ వద్ద నుంచి చెవిదుద్దులను తీసుకుపోయింది. ఈ మేరకు నిందితురాలి నుంచి 34.8 గ్రాముల బంగారం, 10 తులాల వెండిని పోలీసులు రికవరీ చేశారు. చెంగాను కాకినాడ కోర్టుకు తరలించగా, రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కరప: ఉప్పలంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కరప ఎస్సై టి.సునీత కథనం ప్రకారం.. యానాంకు చెందిన శ్రీదేవి తన కుమార్తె లక్ష్మీతులసి, మనుమరాలితో కలసి బుధవారం రాత్రి ఆటోలో సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామానికి బయలుదేరారు. ఉప్పలంక వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి తోపుడుబండి అడ్డురావడంతో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి వారిని ఆసుపత్రికి తరలించారు. గురువారం బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శక్తి రూపిణీ శరణు శరణు


అమలాపురం శ్రీదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో దుర్గమ్మగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు

శక్తి రూపిణీ శరణు శరణు
అంటూ ఆ దుర్గామాతను భక్తజనం పూజించింది. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ దేవాలయాలు, ఉత్సవ మంటపాల్లో వేడుకలు అంబరాన్నంటాయి. ప్రధానంగా దుర్గాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు.



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దుర్గామాతగా బాలాత్రిపుర సుందరీదేవి


శుంభ, నిశుంభుల వధ అలంకరణలో కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారు


తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ


దుర్గాదేవి అలంకరణలో లోవ తలుపులమ్మ వారు


అన్నవరం వనదుర్గమ్మకు దుర్గామాతగా అలంకరణ


దుర్గాదేవి రూపంలో వెదురుపాక విజయదుర్గమ్మ వారు


రాపర్తిలో దుర్గామల్లేశ్వరి దేవికి రూ.15 లక్షల కరెన్సీతో ప్రత్యేక అలంకరణ

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం


మహిళా రైతులతో మాట్లాడుతున్న కేరళ బృంద సభ్యులు

అల్లవరం: అల్లవరం మండలం కోడూరుపాడులో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై కేరళ రాష్ట్రానికి చెందిన ఐదుగురు సభ్యులతో కూడిన బృందం గురువారం అధ్యయనం చేసింది. కోడూరుపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను వారు సందర్శించి స్థానిక రైతుల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సాగు విధానం, ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే మొక్కల నుంచి ఎరువులు, క్రిమి సంహారకాలు ఎలా తయారు చేయాలో రైతులను అడిగారు. ఏపీ తరహాలో కేరళ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వచ్చామని బృందం ప్రతినిధులు తెలిపారు. అనంతరం అల్లవరంలో మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా సంఘాలతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి రుణాలు మంజూరు చేస్తున్నామని ఏపీఎం సయ్యద్ కేరళ బృందానికి తెలిపారు. కేరళకు చెందిన వినోద్, రజిని, కవిత, అప్పుకుట్టి, గిరిజా, జి.శ్రీనివాసరావు, చంద్రబాబు, డీపీఎం ఎంపీవీ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీపాదుకా భీమనాథం గ్రంథావిష్కరణ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్ర చరిత్ర, స్థల పురాణం, పూజా విధానం, స్తోత్రాలతో కూడిన శ్రీపాదుకా భీమనాథం గ్రంథాన్ని ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని చేతుల మీదుగా మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ కాశీ క్షేత్రానికి చెందిన శ్రీపాదుకా ఆచార్య కొల్లూరు అవతార్ గురూజీ చక్కని గ్రంథాన్ని రచించడంతో పాటు దసరా శరన్నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని ద్రాక్షారామ క్షేత్రంలో సతీమణి వెంకట రమణమ్మ సమేతంగా శిష్య బృందంతో కలసి లోక కల్యాణార్థం చండీ హోమం నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా శ్రీపాదుకా ఆచార్య కొల్లూరు అవతార్‌శర్మ గురూజీ స్వయంగా రచించిన శ్రీపాదుకా భీమనాథం గ్రంథాన్ని ఆవిష్కరించడం ఆనందాయకమన్నారు. కార్యక్రమంలో శ్రీరాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, పలువురు కాశీ వాసులు పాల్గొన్నారు.


ద్రాక్షారామలో గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ దుర్గాభవాని, కొల్లూరు అవతార్ శర్మ గురూజీ తదితరులు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


దంపనబోయిన శివ (ఫైల్)

దేవరపల్లి: ఆర్థిక ఇబ్బందులతో దేవరపల్లి మండలం సంగాయగూడేనికి చెందిన దంపనబోయిన శివ (32) బుధవారం ఇంటి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చాగల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అతను మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు. మృతుడు శివ జంగారెడ్డిగూడెంలోని ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో ఆర్టీసీ బస్సు ఢీకొని తణుకుకు చెందిన చల్లా కాశీవిశ్వనాథ్ (70) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తణుకు పట్టణానికి చెందిన కాశీవిశ్వనాథం దేవరపల్లిలోని తన కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. గురువారం యర్నగూడెంలో రోడ్డు దాటుతుండగా నిడదవోలు డిపోనకు చెందిన బస్సు నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఢీకొంది. ఈ ప్రమాదంలో కాశీవిశ్వనాథం తలకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

శివలింగం అపహరణపై ఫిర్యాదు

కాకినాడ క్రైం: కాకినాడ సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి శివాలయ కోనేరు ఆవరణలో ఏకశిల నాగశివలింగం అపహరణపై టూ టౌన్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించారు. సామాజిక వేత్త, ఆధ్యాత్మిక ఉపాసకుడు దూసర్లపూడి రమణరాజు కలెక్టర్ షణ్మోహన్‌కు అందించిన ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఫిర్యాదుదారు రమణరాజు నుంచి గురువారం టూ టౌన్ సీఐ అప్పలనాయుడు వివరాలు సేకరించారు. 2018లో ముగ్గురు పీఠాధిపతులు మూడు రోజుల పాటు యాగాలు నిర్వహించి, కోనేరుకు నైరుతిలో నాగ శివలింగాన్ని ప్రతిష్ఠించారని రమణరాజు తెలిపారు. కోనేరు నిర్వహణ లేక పీఠాధిపతులు ప్రతిష్ఠించిన నాగశివలింగం అపహరణకు గురైందన్నారు.

రైస్ మిల్లుల యజమానులపై కేసులు

దేవరపల్లి: రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం రాత్రి దేవరపల్లిలోని రెండు, అనంతపల్లిలో ఒక రైస్ మిల్లుపై మెరుపు దాడి చేశారు. అక్కడ అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంతో పాటు పలు అవకతవకలు గుర్తించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ మేరకు జేసీ చిన్నరాముడు గురువారం విచారణ చేశారు. అనంతపల్లిలోని మద్దు సత్యనారాయణకు చెందిన శ్రీవేంకట సత్యామిల్లులో రూ. 36.40 లక్షల విలువైన 80 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్టు గుర్తించామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. గతంలో రెవెన్యూ అధికారులు 270 కిలోల బియ్యాన్ని సీజ్ చేసి, దానిని దేవరపల్లిలోని చెలంచర్ల అప్పారావుకు చెందిన వరలక్ష్మీ రైస్‌మిల్లులో భద్రపరచాలని సూచించారు. ఆ బియ్యం లేకపోవడంతో కేసు నమోదు చేశారు. 2021లో 16 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం అధికారులు సీజ్ చేసి దేవరపల్లిలోని చలంచర్ల హరిబాబుకు చెందిన శ్రీవేంకటేశ్వర రైస్ మిల్లులో భద్రపర్చారు. దీనికి సంబంధించిన బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ రికార్డు లేనందున తదుపరి చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు.

నల్లజర్ల: నల్లజర్లలో మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంలో అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం లెక్కింపు కొనసాగుతోంది. గురువారం సాయంత్రం 7 గంటలకు 50 కిలోల బస్తాలు 912 వరకూ ఉన్నట్లు గుర్తించారు. ఈ లెక్కింపు రాత్రి 12 గంటల వరకు ఉంటుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శాంతిప్రియ తెలిపారు.

యువతకు ఉద్యోగావకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డైకిన్ ఆధ్వర్యంలో డిప్లొమా (మెకానికల్/ ప్రొడక్షన్ / ఆర్ఏసీ/ ఆటోమొబైల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్) చదివిన వారికి ఆపరేటర్ (ప్రొడక్షన్ / క్వాలిటీ) ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆపరేటర్‌గా పనిచేయడానికి ఆసక్తి కలిగిన 18–25 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులన్నారు. నెలకు రూ.12,435, బెనిఫిట్స్, రవాణా, భోజనం, యూనిఫాం, 14 రోజుల ట్రైనింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులకు శ్రీసిటీలో 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 91544 49677, 94403 74535 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మనసు మురిసే వేళ..



మనసుకెంత సంతోషమో కదా.. నీలాకాశాన్నే చూడాలా.. పచ్చని పైర్లలో అలాఅలా తిరగాలా.. మబ్బుల మంచెపై సయ్యాటలాడాలా.. ఏదీ నిర్ణయించుకోలేక ఎంత ఉబలాట పడుతుందో కదా.. ఈ ప్రకృతి చిత్రంలో ఒకదాన్ని మించిన అందం మరొకదానిది. చూసిన కళ్లకి ఎంత ఆనందమో.. ఆలమూరు మండలం మడికి నుంచి కడియం మండలంలోని దుళ్ల వెళ్లే రోడ్డులో కనువిందు చేసిన నేలా.. నీలాకాశాలు..
–ఆలమూరు

చెరువులో మద్యం సీసాలు
ఎగబడిన జనం


మద్యం సీసాలు వేసింది ఈ చెరువులోనే..

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం రాపాక గ్రామ శివారు చెరువులో మద్యం సీసాలు ఉండడంతో కలకలం రేగింది. గడిచిన రెండు రోజులు రాపాక సమీప గ్రామం కేఓ మల్లవరంలో మద్యం అక్రమ నిల్వలతో పట్టుబడిన నలుగురిపై రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో భయాందోళన చెందిన పరారైన అక్రమ వ్యాపారులు మద్యం సీసాలను రాపాక శివారు చెరువులో వేసినట్టు తెలుస్తుంది. పది నుంచి 15 మూటల్లో మద్యం సీసాలు పడేసినట్టు స్థానికుల నుంచి అందిన సమాచారం బట్టి తెలిసింది. గురువారం ఉదయం అటుగా వెళ్తున్న కొంతమంది చెరువులో నీటిపై తేలిన మద్యం సీసాలను గుర్తించారు. ఈ విషయం గ్రామస్తులకు, అటుగా వెళుతున్న వారికి తెలియడంతో మద్యం సీసాల కోసం ఎగబడ్డారు. దీంతో చెరువులోకి దిగి కొంతమంది మద్యం ప్రియులు సీసాలను గంట వ్యవధిలోనే తస్కరించారు. ఈ విషయం తెలియడంతో రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ నిర్వహించారు. అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి స్థానికుల నుంచి నాలుగు మూటల్లో మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వ్యాపారిని అడ్డగించిన నలుగురి అరెస్ట్

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై పశువుల వ్యాన్‌ను అడ్డగించిన కేసులో నలుగురిని అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నాడని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు గురువారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి సమయంలో విజయనగరానికి చెందిన గొలగాని ఆదినారాయణ తన బొలెరో వాహనంలో పశువులను హనుమాన్ జంక్షన్‌కు తీసుకు వెళ్తున్నాడు. స్థానిక ఎన్‌హెచ్‌పై నరేంద్రగిరి వద్ద ఐదుగురు కారులో వచ్చి, బొలెరో వాహనాన్ని అడ్డగించి, లంపకలోవ వెళ్లే రోడ్డులోకి తీసుకుపోయారు. ఆ దారిలో మామిడితోట వద్ద బొలెరో డ్రైవర్‌ను చంపుతామని బెదిరించి, అతని నుంచి రూ. 10 వేలు తీసుకున్నారు. ఈ మేరకు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. నిందితులు జల్లూరుకు చెందిన గున్నబత్తుల శివ, గోరింటకు చెందిన కలగా హరీష్, విరవాడకు చెందిన కందా పాపారావు(పవన్), గోరింట గ్రామానికి చెందిన కర్రి శివలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 వేలు, పశువులు, నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. ఎస్.తిమ్మాపురానికి చెందిన మరో నిందితుడు కుంచే ఆనంద్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.